ప్రజాశక్తి

శుక్రవారం 13 జనవరి 2023

5

అల్లూరి సీతారామరాజు



సిమెంట్ చెత్త కుండీల ఏర్పాటు

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద కొక్కిరాపల్లి ఘాట్ వ్యూపాయింట్ మలుపు వద్ద రెండు చోట్ల జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు అటవీశాఖ ఆధ్వర్యంలో సిమెంట్ చెత్త కుండీలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి వెంకటరావు తెలిపారు. పర్యాటకులు వ్యర్థాలను ఈ కుండీల్లో వేసి పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఎఫ్‌బిఒలు ప్రసాద్, గంగరాజు, ఎబిఒలు గోవింద్, దివ్య పాల్గొన్నారు



చెత్త కుండీలను ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది

సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో

నిర్మాణ పనుల అడ్డగింత

ఏకపక్షంగా వైసిపి కార్యాలయానికి భూమి కేటాయింపు



చదునుచేసే పనులను అడ్డుకుంటున్న సిపిఎం, గిరిజన సంఘం నేతలు, ప్రజలు

ప్రజాశక్తి -పాడేరు : మండలంలోని చింతలవీధి గ్రామ పరిధిలో వైసిపి కార్యాలయ నిర్మాణానికి భూమిని చదును చేసే పనులను గురువారం సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నడుం వీధి, ఉబ్బేడు పొట్టు గ్రామస్తులు అడ్డుకున్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూమిలో పార్టీ కార్యాలయ నిర్మాణం చేపట్టేందుకు సన్నద్ధమవ్వడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. పాడేరు మండలం చింతల వీధి సచివాలయం పరిధిలో నడుం వీధి, ఉబ్బేడు పుట్టు గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న భూమిలో వైసిపి కార్యాలయం నిర్మాణానికి 2..35 ఎకరాలను కేటాయించి, ఆ భూమిని చదును చేస్తున్న క్రమంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సుందరరావు మాట్లాడుతూ గిరిజనుల సాగులో ఉన్న భూమిని వైసిపి కార్యాలయానికి అధికారులు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. జిల్లాస్థాయి అధికారులు,ెవెన్యూ అధికారులు ఒక గ్రామసభ గానీ, పీసా కమిటీ తీర్మానం చేయకుండా ఏకపక్ష ధోరణితో అధికార పార్టీ కార్యాలయానికి భూమిని కేటాయించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రజల హక్కులు, చట్టాలను అధికారులే కాలరాస్తుంటే ఇంకెవరిని ప్రశ్నించాలన్నారు. ఐదవ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన ప్రాంత భూమిని వైసిపి కార్యాలయానికి ఇచ్చి గిరిజన హక్కులు, చట్టాలను జిల్లా అధికారులే తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. భూమిని సాగుచేస్తున్న రైతులకు పంచాయతీ, రెవెన్యూ, సచివాలయం, చివరకు గ్రామవాలంటీర్ల ద్వారానైనా కనీసం సమాచారం ఇవ్వకుండా, గ్రామసభ నిర్వహించకుండా ఏకపక్షంగా పేద గిరిజనుల భూమిని కేటాయించడం దుర్మార్గమన్నారు. గడచిన అక్టోబర్‌లో దీనికి సంబంధించి గ్రామసభలో చేసిన తీర్మానాన్ని పరిగణించకుండా, గిరిజనుల జీవనోపాధిని హరిస్తూ వైసిపి కార్యాలయానికి చేసిన భూమి కేటాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు.సతీష్, వెంకటరమణ, చినబాబు, ఎం.రాజు, యూ.ప్రకాష్, ఎం.మహేష్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం మెయిన్‌గేటు వద్ద పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. ఒకేప్రాంతంలో పదేపదే పైపులైన్ నుంచి నీరు లీకేజీ అవుతున్నా పటిష్ట చర్యలు చేపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ లేకుండా, అవగాహన లేమి వ్యక్తులతో పైప్‌లైన్ బిగించడం వల్లే ఒక్క చోటే పదేపదే వాటర్ లీకవుతోంది. భారీగా లీకవుతున్న నీరు రోడ్డుపైనే ప్రవహస్తూ దుకాణాల ముందు బురదమయం చేయడంతోపాటు సుజనకోటకు వెళ్లే రోడ్డులోనూ పారుతోంది. దీంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, పైప్ లైన్ లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు. మండల కేంద్రంలోనే, ముఖ్యంగా అధికారులు, నేతలందరూ వచ్చిపోయే మండల పరిషత్ కార్యాలయం వద్దే పైపులైన్ లీకేజీ ఉన్నా ఎవరికీ పట్టకపోవడం శోచనీయమని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -హుకుంపేట: సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు చేరుకునే యువత మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని స్థానిక ఎస్ఐ బి.సతీష్ హితవు పలికారు. . గురువారం రాళ్లగడ్డ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. పండగకు సొంతూళ్లకు వస్తున్నామన్న ఆనందంలో మద్యంమత్తులోవాహనాలు నడిపినా, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేని పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ విధిగా ఉండాలన్నారు. తనిఖీల్లో పట్టుబడితే కేసులు తప్పవన్నారు. సంక్రాంతికి ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊళ్లకు వెళ్లాల్సిన పరిస్థితుల్ల పక్కింటివారికి తప్పక సమాచారాన్ని ఇవ్వాలన్నారు. పేకాట, కోడిపందేలు, జూదం, గుండాట ఆడితే చర్యలు తప్పవన్నారు. ఎఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

29న మోదకొండమ్మ తీర్థం



అమ్మవారి వార్షిక కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -పాడేరు : మోదకొండమ్మ సంక్రాంతి తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 29న ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. గురువారం అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఆలయ కమిటీ సమావేశంలో మోదకొండమ్మ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న మోదకొండమ్మ తీర్థంలో భాగంగా 29న అమ్మవారికి పల్లకిసేవ, సాయంత్రం నేలవేషాలు, బాణాసంచాతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు తీర్థ మహోత్సవంలో భాగంగా అమ్మవారికి భక్తుల సారే సమర్పణ, ముగ్గుల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అమ్మవారి హుండీ లెక్కించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూరెడ్డి రాము, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ప్రతినిధులు సభ్యులు ఉప్పల వెంకటరత్నం, రామారావు పూసర్ల గోపి, ముకుంద కొండలరావు పాల్గొన్నారు..

గొంతెండుతున్నా పట్టించుకోరా..?

- తాగునీటి ఎద్దడిపై బొర్రపనస గిరిజనుల ఆవేదన
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చలించని అధికారులు
- సొంత నిధులతోనే గ్రావిటీ పథకానికి మరమ్మతులు
- పూర్తిస్థాయిలో బాగుచేయాలని గ్రామస్తుల వినతి



బొర్రపనసలో గ్రావిటీ పథకం నీటి ట్యాంక్

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు: మండలంలో అతి మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీ బొర్రపనస గ్రామంలో గిరిజనులు తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని గ్రావిటీ పథకం పైపులైను పాడవ్వడంతోపాటు నీటి ట్యాంకర్ దిమ్మ పాడై నీటిఎద్దడికి కారణమౌతోందని వాపోతున్నారు. దీనిపై అధికారులకు అనేకమార్లు విన్నవించినా చలనం లేకపోవడంతో సొంత నిధుల వెచ్చించి, శ్రమదానంతో పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, అయినాసమస్య శాశ్వతంగా తొలగిపోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రానున్న వేసవిలోగా ఈ గ్రావిటీ పథకానికి పకడ్బంధీ మరమ్మతులు చేపట్టి, వేసవిలోగ్రామస్తుల గొంతెండకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బొర్రపనసలో గ్రావిటీ పథకం వాటర్ ట్యాంకు, పైప్లులైన్ మరమ్మతులకు గురై అస్తవ్యస్తంగా తయారవడంతో గ్రామస్తులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని ఆవేదన చెందుతున్నారు. పైపులైన్ మరమ్మతుకు నేరుగా కార్యాలయాలకు వెళ్లి, అలాగే గ్రామసభ నిర్వహణకు వచ్చినపుడు అధికారులకు విన్నవించినా స్పందించ లేదని బుర్రపనస గ్రామస్తులు ఆవేదన చేశారు. కొన్నినెలలుగా పాడైన పైపులైన్‌తో తాగునీరు వచ్చే పరిస్థితి లేకపోగా, అరకొరగా వచ్చిన నీరు కలుషితంగా ఉండడంతో అవస్థలు పడుతున్న గ్రామస్తులంతా అధికారులు పట్టించుకోక పోవడంతో ఊటబావి నుంచి బొర్రపనస వరకు పూడుకపోయిన పైపులైన్‌కు స్వచ్చందంగా మరమ్మతులు చేపట్టాలని బొర్రపనస గ్రామస్తులు పాంగి సత్యం, కిల్లో బాహనే, కిల్లో శివయ్య, కిలో భాస్కర్, పాంగి పూలు తదితరులు అంటున్నారు. ఊటబావి నుంచి బొర్రపనస వరకు సుమారు కిలోమీటరు పొడవైన గ్రావిటీ పథకం పైపులైన్‌కు సొంతనిధులతో మరమ్మతులు చేపట్టి, తాత్కాలికంగా నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తక్షణమే స్పందించి బుర్రపనస గ్రామంలో దాహార్తి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కొత్త ఇళ్లు లేవు.. పాత బిల్లులు రావు

సర్పంచ్ ఆధ్వర్యంలో జబడ గిరిజనుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఇళ్ల లబ్ధిదారులు

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు : అర్హులకు కొత్తగా ఇళ్లు మంజూరుచేయక, గతంలో కట్టుకున్న వారికి బిల్లు బకాయిలు చెల్లించక గృహనిర్మాణదారులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని అతి మారుమూల లక్ష్మీపురం పంచాయతీ, జబడ గ్రామంలో బిల్లులు అందక అర్థాంతరంగా నిర్మాణాలు నిలిచి మొండిగోడలతో దిష్టిబొమ్మల్లా ఉన్న ఇళ్ల వద్ద సర్పంచ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు, గ్రామస్తులు నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచినా కొత్తగా ఒక్క ఇల్లయినా మంజూరు చేయలేదన్నారు. సరికదా గత ప్రభుత్వహయాంలో మంజూరైన నిర్మాణంలో ఉన్న ఎన్‌టిఆర్‌గృహాలు, పిఎంఎవై సక్రమంగా బిల్లులు చెల్లించక పనులు ముందుకు సాగని దుస్థితి కల్పించారని మండిపడ్డారు. గత ప్రభుత్వహయాంలో నిర్మించిన ఇళ్లనే ఒకేఒక్క సాకుతో నిరుపేద లబ్ధిదారులను బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం దారుణ మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటిస్థలంతోపాటు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.ఐదు లక్షల సాయం అందించి సొంతింటి కలను సాకారం చేయాలని కోరారు. అలాగే పాత లబ్ధిదారులకు ఇళ్ల బిల్లు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జబడ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్వాడీభవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధినిజగన్ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, లేకుంటే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఉప సర్పంచ్ అర్లాబు సత్యం, వార్డు సభ్యులు సావు సోద, సిపిఎం నాయకులు కిల్లో ధనుంజయ, పురుసితి, టి.గణపతి, గోపాల్, గురు పాల్గొన్నారు.

బోసిపోయిన సీలేరు మార్కెట్

కొనుగోలుదారులు రాక డీలాపడ్డ వ్యాపారులు



కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న సీలేరు మార్కెట్

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మార్కెట్‌కు గురువారం కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపారులు డీలాపడ్డారు. సంక్రాంతి పండగకు రెండు రోజులే గడువు ఉండడంతో వ్యాపారాలు ముమ్మరంగా ఉంటాయని వర్తకులు ఆశించారు. ప్రతి ఏడాది పండగకు వారం రోజుల ముందు నుంచి ఆంధ్ర ఒడిశా సరిహద్దు దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీల నుంచి గిరిజనులు సీలేరు మార్కెట్‌కు చేరుకుని వారికి కావలసిన నిత్యావసర సరుకులు, నూతన దుస్తులు కొనుగోలు చేసేవారు. అటువంటిది ఈ ఏడాది ఎవరూ రాలేదు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ద్వారా కొనుగోలుకు యువత ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. వారికి కావలసిన దుస్తులు, ఇతర సామాగ్రి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగా, అవి వారి ఇంటి వద్దకే చేరుతుండడంతో వినియోగదారులు వాటి పైన దృష్టి సారించారు. దీంతో కొనుగోలుదారు రాకపోవడంతో వ్యాపారాలు సాగక బట్టల వ్యాపారులు తల పట్టుకుంటున్నారు.

సంక్రాంతికి విరివిగా బట్టలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారని వ్యాపారులు ఖరీదులు చేసి సిద్ధం చేశారు. అయినప్పటికీ ఎవరు సీలేరు మార్కెట్‌కు రాలేదు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు మల్కన్‌గిరి జిల్లా పప్పులూరు, కురమునూరు, కప్ప తొట్ట, అల్లూరు కోట తదితర మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన వారికి కావలసిన నూతన దుస్తులు, నిత్యవసర సరుకులు వారి చెంతకే పలువురు వ్యాపారాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అలాగే ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం పూర్తిస్థాయిలో ఏర్పడడంతో మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండలో మరికొన్ని సామగ్రిని కొనుగోలు చేసేందుకు గిరిజనులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సీలేరు మార్కెట్‌కు కొనుగోలుదారులు రాకపోవడంతో గురువారం మార్కెట్ బోసిపోయింది.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి, ఎస్ఐ

ప్రజాశక్తి-విఆర్.పురం

సంక్రాంతి పండుగను పరస్కరించుకొని మండలంలోని పెద్దమటపల్లి గ్రామంలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలను విఆర్.పురం ఎస్సై దుర్గాప్రసాద్, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, మన్యం క్రీడా స్ఫూర్తిని సాటి చెప్పాలని కోరారు. ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యువత మానసిక ఉల్లాసానికి, ఉత్తేజానికి ఇటువంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీలలో యువత అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కోడి పందేలు, పేకాట జోలికి పోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం సత్తిబాబు, మోసం చంద్రరావు, పండా వెంకటేష్, గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం సత్తిబాబు మోసం చందర్ రావు పండా వెంకటేష్ గ్రామ పెద్దలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

పరీక్షా కేంద్రం ఏర్పాటుకు కమిషనర్ హామీ

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఎన్‌వి. శేషగిరి హామీ ఇచ్చినట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు జూనియర్ కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తాను దరఖాస్తుల ద్వారా ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి తెలియజేశామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే పాడేరు ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలకృష్ణ ప్రత్యేకంగా శ్రద్ధ కనబరిచి విజయవాడ వెళ్లి కమిషనర్‌ను కలిసి సీలేరులో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరినట్లు వెల్లడించారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఐటిడిఏ పిఓ గోపాలకృష్ణ తమకు సమాచారం అందించారని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్ష కేంద్రం గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు.

విహారయాత్రలో విషాదం

జడేరు వాగులో జారిపడి విద్యార్థి మృతి



సుభాష్ చంద్ర మృతదేహం

ప్రజాశక్తి- అడ్డతీగల

విహార యాత్రలో విషాదం చోటుచేసుకుంది. మండలంలోని వేటమామిడి పంచాయతీ పైడిపుట్ట గ్రామం వద్ద ఉన్న జడేరు వాగులో గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాస్తు కాలుజారి పడి పదవ తరగతి విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన దోకు బుర్ర సుభాష్ చంద్ర (14) అదే గ్రామంలో చెరుకూరి విద్యాసంస్థల్లో పదవ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం చెరుకూరి విద్య సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది 60 మంది, తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులతో కలిపి నాలుగు బస్సుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం వేట మామిడి పంచాయతీ పైడిపుట్ట గ్రామం వద్ద ఉన్న జడేరు వాగు ప్రాంతానికి విహారయాత్రకు వచ్చారు. ఉపాధ్యాయ సిబ్బంది అందరికీ భోజనాలు సమకూర్చే పనిలో నిమగ్నమై ఉండగా, ఈలోగా విద్యార్థులు స్నానాలు చేసేందుకు వాగు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సుభాష్ చంద్ర ప్రమాదవశాస్తు కాలుజారి వాగులో కొట్టుకుపోయాడు. తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది సుభాష్ చంద్రను కాపాడే ప్రయత్నం చేసి సుభాష్ చంద్రను బయటకు తీశారు. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న సుభాష్ చంద్రను హుటాహుటిన అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సుభాష్‌చంద్ర తండ్రి వీరయ్య ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




చింతూరుకు వాహనంలో దుస్తులు తీసుకొచ్చిన యుటిఎఫ్ కోనసీమ నాయకులు

ముంపు మండలాల వరద బాధితులకు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి చింతూరు

చింతూరు డివిజన్ పరిధిలో 2022 జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సంభవించిన వరదలకు నిర్వాసితులైన బాధిత కుటుంబాల వారికి ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యాన గురువారం దుస్తులు పంపిణీ చేశారు. యుటిఎఫ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాదాపు రెండున్నర టన్నులు బట్టలు సేకరించి తీసుకొచ్చారు. ముంపు మండలాలైన కూనవరం, విఆర్ పురం మండలాల్లో వరద బాధిత కుటుంబాలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం వరద బాధితులకు 900 క్వింటాళ్ల బియ్యం అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కోనసీమ జిల్లా నాయకులు జ్యోతి బస్సు, మురళి, సురేష్, వైవిఎస్ఎన్.బాలాజీ, రావులపాలెం మండల ప్రధాన కార్యదర్శి వివిఆర్‌కె.సోమేశ్వరావు, కోశాధికారి బివి.రమణ, కోనసీమ జిల్లా కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్ కె.శ్రీనివాస్, యుటిఎఫ్ అల్లూరి జిల్లా నాయకులు పండా కష్ణయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.నాగేశ్వరరావు, మండల నాయకులు బొగ్గ ముత్తయ్య, పి.కన్నారావు, యం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు పూనెం, చినబాబు తదితరులు

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రజాశక్తి దిన పత్రిక ముద్రించిన 2023 కేలండర్‌ను రేఖపల్లిలోని సీపీఎం కార్యాలయంలో గురువారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యం దేశ వర్తమాన రాజకీయాలతో పాటు ప్రజా సమస్యలపై అనేక వార్తలను ప్రచురిస్తూ ప్రజాశక్తి ముందుకెళ్తుందని చెప్పారు. రంగుల హరివిల్లు వలే కేలండర్‌ను ముద్రించిన ప్రజాశక్తి యాజమాన్యానికి వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం మండల నాయకులు గుండుపూడి లక్ష్మణరావు, ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు

గోదావరి డెల్టాకు 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల



ఎస్ఇ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి -సీలేరు

గోదావరి డెల్టా నీటి అవసరాలకు విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పవర్ కెనాల్ నుంచి 11.5 అడుగులు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయని, మరో 15 రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పవర్ కెనాల్ నుంచి నీటిని విడుదల చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

సీలేరు కాంప్లెక్స్ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి

సీలేరు కాంప్లెక్స్ పరిధి జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఏపీ జెన్కో ఈఈ బాలకృష్ణ వెల్లడించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో బుధవారం 1.54 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయగా, గురువారం 1.64 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసిందని వెల్లడించారు డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో 42, పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 3.8 నుంచి 4 మిలియన్ యూనిట్లు వరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు.

ప్రహసనంగా ఆర్‌డిఒ బదిలీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఆర్‌డిఒ భవానీశంకర్‌ను మరల బదిలీ చేశారు. గతంలోనూ భవానీశంకర్‌ను బదిలీ చేసి జయరాంను ఆర్‌డిఒగా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీలను నిలిపివేయడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భవానీశంకర్ కొనసాగారు అయితే ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి కావడంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జయరాంను నర్సీపట్నం ఆర్‌డిఒగా పోస్టింగ్ ఇచ్చి, ఇక్కడున్న భవానీశంకర్‌ను సిఎం పేషీకి బదిలీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రావికమతం : ప్రకృతి వ్యవసాయంపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని గర్నికం క్లస్టర్ ఇంచార్జ్ నిర్మల అన్నారు. గురువారం కొత్తకోట బిపి.అగ్రహారం గ్రామంలో వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ఆవరణంలో మహిళా సంఘాలకు, గ్రామ సంఘాలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.ద్రవ, ఘన జీవామృతం, పుల్లటి మజ్జిగ, నీమాస్త్రం లాంటి కషాయాలతో తక్కువ ఖర్చుతో సస్యరక్షణ చర్యలు చేపట్టి, ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. కూరగాయల పంటలో సూర్య మండల్ ఆకారంలో న్యూ గ్రీన్ నమూనా తయారీ, తక్కువ స్థలంలో ఎక్కువ బెడ్స్ వేసి ఆరుతడికి నీటిని అందించే కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి విధానంలో సాగుచేసిన కాలుష్యరహిత పంటలతో ప్రజల ఆరోగ్యం కాపాడవచ్చని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిగి ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-రోలుగుంట : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామాల్లో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నాగకార్తీక్ హెచ్చరించారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. సంక్రాంతి పురస్కరించుకొని గ్రామాల్లో తీర్థ మహోత్సవాల్లో మద్యం తాగి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వాహనాలు నడిపినా, కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై 9490619495 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

గొలుగొండ : సంక్రాంతి పండుగల నేపథ్యంలో గ్రామాల్లో కోడిపందాలు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కెడీపేట ఎస్ఐ సూర్యనారాయణ హెచ్చరించారు. సంక్రాంతి పండుగలు, తీర్థాల సందర్భంగా పోలీసుల ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే 9440904240 నెంబరుకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వైసిపి సభ్యత్వానికి రొంగలపాలెం సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని రొంగలపాలెం సర్పంచ్ లోవరాజు వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎంపిపి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి రమణమ్మకు అందించారు. అధికారపార్టీలో చేరితే గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చున ఆశతో వైసిపిలో చేరానని, అయినా తనకు సరైన గుర్తింపులేదు సరికదా, కనీసం అభివృద్ధి చేసుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు అభివృద్ధి చేయలేని స్థితిలో నిస్సహాయతతో రాజీనామా చేశానన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అత్మీయ కలయిక గురువారం నిర్వహించారు. పదో తరగతి పాసైన తర్వాత ఏదో ఒక సందర్భంలో కలిసిన వాళ్ళు కొంతమంది ఉంటే మరి కొంతమంది విద్య, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో ఎక్కడెక్కడికో వెళ్ళి స్థిర పడ్డారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత వాళ్లంతా పాఠశాలలో గడిపి, పూర్వజ్ఞాపకాలు, మధురానుభూతులను నెమరవేసుకున్నారు.

అక్రమ కట్టడం తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేటలోని పార్కింగ్ స్థలంలో కట్టిన కట్టడాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ, జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలను గుర్తించి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ కంటి ఆసుపత్రికి అత్యాధునిక పరికరాలు


మాట్లాడుతున్న డాక్టర్ విశ్వమిత్ర

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి అత్యాధునిక పరికరాలు రానున్నాయని ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర తెలిపారు. రామాటాకీస్ వద్ద గల ఆసుపత్రిలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ మల్లికార్జున మంజూరు చేసిన రూ.25 లక్షలతో ఆసుపత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన 250 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 620 కెవి జనరేటర్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలకు ఉపయోగించే మూడు సీట్లు ల్యాంప్‌లు సమకూరాయని, వీటిని త్వరలో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవతో హెచ్‌పిసిఎల్ కంపెనీ సిఎస్ఆర్ కింద ఆసుపత్రి అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.28 లక్షలతో గ్లుకోమా వ్యాధిగ్రస్తుల్లో దృష్టి సామర్థ్యాన్ని అంచనా వేసే అత్యాధునిక విజువల్ ఫీల్డ్ ఎనలైజర్ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రెటీనా సంబంధిత, క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించడానికి అవసరమైన పేకో మిషన్లను రూ.60 లక్షలతో కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. రూ.15 లక్షలతో స్పెషల్ మైక్రోసాఫ్ట్ అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ పరికరాలన్నీ అందుబాటులోకి వచ్చాక కార్పొరేటర్ ఆసుపత్రిలో లభిస్తున్న ఎంతో ఖరీదైన వైద్య సేవలు ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో 90 శాతం వరకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆపరేషన్ కోసం వచ్చేవారికి అరగంటలో వైద్య పరీక్షలు పూర్తిచేసి శస్త్రచికిత్సకు పంపేలా ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. కంటి వైద్యానికి సంబంధించి సలహాలు, సూచనల కోసం ఆసుపత్రికి వచ్చేవారికి ప్రతి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రతిస్పందన సేవలు అందిస్తామని తెలిపారు. నిపుణులైన వైద్యులు సెకండ్ ఒపీనియన్ సేవలు సలహాలు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధిక శాతం సుమోటో కేసులు

ప్రజాశక్తి-సిరిపురం : అధిక శాతం సుమోటో కేసుల స్వీకరణతోనే బాలలకు సత్వర న్యాయం జరుగుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకట రమణ పేర్కొన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్న ఆయనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుప్పల వెంకటరమణ మాట్లాడుతూ, రాష్ట్రంలో బాలల హక్కులు, పరిరక్షణ వారి సంక్షేమంతో పాటు దురదృష్టకర సంఘటనలు, పరిణామాలు చోటుచేసుకున్నట్లు ప్రసార సాధనాల్లో వచ్చే వార్తలను, అందిన ఫిర్యాదుల్లో నూరు శాతం వాస్తవ ఆధారాలున్నట్టు భావిస్తే వాటిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోలుగా స్వీకరించాలని సూచించారు. లోక్‌సభ, రాజ్యసభల ఆమోదంతో ఏర్పడ్డ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్టబద్ధంగా ఎంతో శక్తివంతమైనదని తెలిపారు. బాలలకు పూర్తి న్యాయం జరిగేలా బాధ్యతగా చర్యలు చేపడితే పిల్లల్లో, వారి తల్లిదండ్రుల మోముల్లో చిరునవ్వులు చూడవచ్చని పేర్కొన్నారు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ, న్యాయమూర్తి సూచించిన ప్రతి అంశాన్నీ కమిషన్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి అమలుపర్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ భేటీలో బాలల సంఘ నాయకుడు బొడ్డేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ఆందోళన

ప్రజాశక్తి- కె.కోటపాడు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు జి.కుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కేంద్రాల పరివేక్షణ పేరుతో వేధింపులు, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ సంపూర్ణ పోషక మెనూ ఛార్జీలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. ర్యాలీలు, సభలు నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు.

'వ్యాపార కేంద్రంగా తిరుపతి దేవస్థానం'

ప్రజాశక్తి-సీతమ్మధార : తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార కేంద్రంగా మార్చేసిందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతితో దేవస్థానం పాలక మండలి తమకు నచ్చినట్టు అతిథి గృహాల్లో భారీగా అద్దెలు పెంచిందని మండిపడ్డారు. ఒక రోజు ఒక గదికి రూ.150 ఉన్న అద్దెను రూ.1,700కు, రూ.200 ఉన్న పెద్ద గది అద్దెను రూ.2,200 పెంచడాన్ని తప్పుపట్టారు. భక్తితో తిరుమలకు వచ్చే భక్తులకు ప్రభుత్వం ఇచ్చే బహుమతి ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే లడ్డు సహా అనేక సేవల ధరలు పెంచారన్నారు. ఆర్జిత సేవల ధరలు పెరిగినా పర్లేదని కొనే వారి స్తోమత, పలుకుబడి బట్టి వారి దర్శనాలు చేసుకొంటున్నారని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులుపెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహిళా సత్తా రాష్ట్ర నేత ఇనగంటి అనంతలక్ష్మి, వేణిశ్రీ, రూప, సిటీ మహిళా సత్తా ప్రతినిధి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రసాభాస

- ఎంపిటిసిల వాగ్వివాదం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్‌పురానికి చెందిన ఎంపిటిసిల మధ్య ఆద్యంతం వాగ్వాదంతో మండల సభ రసాభాసగా మారింది. గురువారం ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జగనన్న కాలనీల్లో డబ్బులు ఇచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేశారని ఏఎల్‌పురం-3 చింతల బుల్లిప్రసాద్‌పై ఏఎల్‌పురం-1 ఎంపిటిసి రుత్తల శివరామకృష్ణ ఆరోపణలు చేశారు. సంబంధిత జెఇ వివరణ ఇస్తున్న సమయంలో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుసుకుంది. ఏఎల్‌పురం-3 ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్‌కు కల్వర్టు నిర్మాణం పూర్తికాకుండానే ఇంజనీరింగ్ అధికారులు చెల్లింపులు చేశారని ఏఎల్‌పురం -1 ఎంపిటిసి రామకృష్ణ ఆరోపించారు. పని పూర్తి చేసినప్పటికీ తొమ్మిది నెలలౌతున్నా బిల్లులు చెల్లింపుల్లో ఇంజనీరింగ్ అధికారులు తాత్కారం చేస్తున్నారని ప్రశ్నించారు. సచివాలయ నిర్మాణాల విషయంలో కూడా ఇద్దరు ఎంపిటిసిలకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. దీంతో ఇది మండల సర్వసభ్య సమావేశమా లేదా ఏఎల్‌పురం పంచాయతీ సమావేశం అంటూ మిగిలిన సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి మణికుమారి, వైస్ ఎంపిపి ఆదినారాయణ ఇరువురిని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో కొద్దిగా అలసత్వం జరిగిందని, 1:2 నిష్పత్తిలో ధాన్యం కొనుగోలు చేయాలనే అనుమతులు వారం పది రోజుల్లో ప్రభుత్వం నుంచి వస్తాయని, వెంటనే రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్, విద్యా, విద్యుత్, వైద్యం, నాడునేడు పనులు, ఉద్యానశాఖ, ఐసిడిఎస్, గృహనిర్మాణాలపై శాఖల వారీగా సమీక్ష జరిగింది. 15 మంది ఎంపిటిసిలకుగాను కోరంకు సరిపడా ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు.కొన్ని శాఖల అధికారులు కూడా హాజరు కాకపోవడంతో మండలసభ మొక్కుబడిగా సాగింది. కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, ఏఎంసి అధ్యక్షులు కొల్లు సత్తిబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీను, ఇఒపిఆర్‌డి రఘురామ్, గొలుగొండ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్, హౌసింగ్ ఎఇ గోపి పాల్గొన్నారు.

'రియల్ దందా'పై విచారణ

- 'ప్రజాశక్తి'కథనానికి స్పందన

ప్రజాశక్తి-కొత్తకోట : రియల్ ఎస్టేట్ ముసుగులో ప్రభుత్వభూములు, ఆస్తుల కబ్జా ఆరోపణలపై అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం ప్రజాశక్తిలో రియల్ దందా శీర్షికతో వచ్చిన కథనానికి తహశీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇరిగేషన్, సర్వే బృందం తట్టబంద రెవెన్యూ పరిధి పొర్లుపాలెం గ్రామంలోని రియల్ ఎస్టేట్ సంస్థ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సుమారు 60 ఎకరాలకు ఎన్ఒసి పొందిన రియల్ ఎస్టేట్ సంస్థ, ఆ భూమిని ఆనుకుని ఉన్న డీఫారం పట్టా భూములతోపాటు ప్రభుత్వ భూములు, చెరువు, సాగునీటి చెక్‌డ్యామ్‌లు, కొండవాగులు, గెడ్డలు, చివరకు శ్మశానాన్ని సైతం సుమారు 36ఎకరాలను కలిపేసుకుందని స్థాని గిరిజనులు ఆరోపిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. దీనిపై ప్రజాశక్తితో పూర్తి వివరాలతో కథనాన్ని వెలువరించగా అధికారుల్లో కదలిక వచ్చింది.

తహసీల్దార్ మహేశ్వరరావు, ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోకివాడ రమణ సమక్షంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేటు భూముల్లోకి గెడ్డలు, చెక్ డాములు కప్పేసి కలుపుకున్నట్టు ప్రాధమిక నిర్ధారణకు వచ్చామని, దీనిపై సమగ్ర సర్వే చేయాల్సి ఉందన్నారు. గిరిజనులకు కొండకు వెళ్లే మార్గాన్ని చూపిస్తామన్నారు. శ్మశానవాటికను గుర్తించి, గిరిజనులకు అప్పగిస్తామన్నారు. రామాలయం నుంచి ప్రభుత్వ భూమి ఉన్నట్టుగా కొద్ది మేర గుర్తించామన్నారు. డీఫారం పట్టా భూములు ఆక్రమణకు గురైతే వాటిని తిరిగి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపి, జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు గిరిజనులు ఆందోళన చెందవద్దన్నారు. చెక్‌డ్యామ్‌ల వివరాలను ఇరిగేషన్ అధికారుల నుంచి సేకరించి, వాటినీ స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గిరిజనుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చినబ్బాయి, సర్వేయర్ భోగేష్ , మండల సర్వేయర్ రొంగళి సత్యనారాయణ, వీఆర్వో గెంజి వెంకటరమణ గ్రామస్తులు వై ఈశ్వరరావు పాల్గొన్నారు.

పలు టోర్నమెంట్లకు సాంకేతిక అధికారిగా డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ స్థాయిలో జరిగే పలు టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లకు సాంకేతిక అధికారిగా విశాఖపట్నంకు చెందిన డివిఎస్‌వై.శర్మ ఎంపికయ్యారు. ఆయన ఈ నెల 30న ఇండోర్‌లో జరగబోయే ఖేలో ఇండియా యూత్ గేమ్‌లకు, 15 నుంచి 20వ తేదీ వరకు వడోదరలో జరగబోయే జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లకు నామినేట్ అయ్యారు. ఈ నెల 7 నుంచి 11 వరకు గోవాలో జరిగిన ప్రభుత్వ రంగ జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా పనిచేశారు.



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఆదర్శప్రాయుడు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఉక్కునగరం : తన కుమారున్ని, చుట్టుపక్కల వారిని పోరాటాలవైపునకు ప్రోత్సహించి, తానూ కడవరకూ ఉద్యమ బాటలో నడిచిన కె.వెంకటేశ్వర్లు ఆదర్శప్రాయుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సంస్మరణ సభను దేహదాన ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమంగా మార్చిన సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను అభినందించారు. ఉక్కు నగరంలోని సిఐటియు కార్యాలయంలో కెఎం.శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ గురువారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు వెంకటేశ్వర్లుతో తనకు ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. ఆయన్ని ఒక వ్యక్తిగా, ఒక తండ్రిగా, ఒక అమరుడిగా మూడు కోణాల్లో చూడాలన్నారు. ఒక మంచి రైతుగా జీవితాన్ని ప్రారంభించి ప్రత్యేక వ్యక్తిగా ఎదిగారని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి విశాఖ వచ్చి విశాఖపట్నంలోనూ ఖాళీగా ఉండకుండా చెట్లు పెంపకం లేదా ఇతరులకు సహాయం చేయడంతో పాటు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. శరీరం సహకరించకపోయినా ఎన్నో కుటుంబాలతో ముడిపడి ఉన్న ప్లాంటును రక్షించడానికి ఆయన తన వంతు కృషి చేశారన్నారు. ఆయన్ని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఒక వ్యక్తిగా, రైతుగా వెంకటేశ్వర్లు జీవించిన తీరు ఆదర్శప్రాయమన్నారు. దేహదాన కార్యక్రమానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి సమాజానికి మంచి సందేశం అందించారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రమేష్ కుమార్, సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జ్యోతిబసు దేహదాన సంస్థ బాధ్యులు అన్నపూర్ణ, ప్రభావతి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దేహదానంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. దేహదానంపై ఆసక్తి ఉన్నవారిని ఆహ్వానించారు.

తెలుగు జాతి ఐక్యం కావాలి : గద్దర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కులాల ఔన్నత్యం పెరుగుతున్న తరుణంలో 675 కులాలుగా ఉండి భౌగోళికంగా విడిపోయిన తెలుగుజాతిని ఐక్యం చేసేందుకు సాంస్కృతిక తెలుగు సేన ముందుకు వచ్చిందని, తెలుగు జాతి అంతా ఐక్యం కావాల్సి ఉందని విప్లవ కవి, గాయకుడు గద్దర్ అన్నారు. తెలుగు సేన ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు సేన అధ్యక్షుడు సత్యారెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాదులో బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దేశంలో 10 రాష్ట్రాలలో భారీ బహిరంగ సభలు, బస్సు యాత్రలు, రోడ్ షోలు కొనసాగుతాయన్నారు. స్మార్ట్ ఫోన్ గ్లోబలైజేషన్‌తో ప్రపంచమంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని అన్నారు. అనంతరం 'అమ్మ నీకు వందనం.. ఓ తెలుగు తల్లి నీకు వందనం' అంటూ... గద్దర్ తన గళాన్ని వినిపించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, స్కూల్ ఆఫ్ థియేటర్స్ కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సగటున 30 శాతం మేర పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను తక్షణం రద్దు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్ ఒక ప్రకటనలో గురువారం డిమాండ్ చేశారు. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ధరలను రెగ్యులర్‌గా పెంచుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రవాణా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో భారం మోపిందన్నారు. లారీ, కారు, ట్రాక్టరు ట్రాలీలకు రోడ్డు ట్యాక్స్‌ను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు.

15న వారణాసిలో స్విచ్ ఆన్

సికింద్రాబాద్ ట్రాక్‌పై రన్
'ఏరో డైనమిక్ డిజైన్' వంటి ఆధునిక ఫీచర్లతో 'వందేభారత్' రైలు
9 గంటల్లోనే విశాఖ - సికింద్రాబాద్ మధ్య ప్రయాణం
రైలు సామర్థ్యం 1200 మంది




విశాఖ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భారతీయ రైల్వేకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (విబిఇ) హై స్పీడ్ రైలు విశాఖ - సికింద్రాబాద్ మధ్య రాకపోకలకు సిద్ధమవుతోంది. ఈ నెల 15న వారణాసిలో ఉదయం 10.30 గంటలకు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖకు ఈ రైలు రెగ్యులర్‌గా రానుంది. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే.

19 నుంచి విశాఖలో ఆరంభం

విశాఖలో ఈ నెల 19 నుంచి ప్రతి రోజూ ఉదయం 5.45 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 2.20 గంటలకు చేరుతుంది. తిరిగి 3 గంటలకు అక్కడ నుంచి బయల్దేరి విశాఖకు రాత్రి 10.45 గంటలకు చేరుతుంది. ప్రతిరోజూ ఉండే రైలు ఇది. థర్డ్ ఎసి కంటే ఛార్జీలు అధికంగా ఉండొచ్చని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. విశాఖ - సికింద్రాబాద్ మధ్య 800 కిలోమీటర్ల దూరాన్ని 9 గంటల్లోగా ఈ వందే భారత్ రైలు చేరుకోనుంది. మామూలు రైళ్ల కంటే మూడు గంటలు దీంట్లో ప్రయాణించేవారికి టైం సేవ్ అవుతుంది. గంటకు 150 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని తెలుస్తోంది. విశాఖలో ఈ నెల 11న ట్రయల్ రన్ ముగించుకుని గ్యారేజీకి వెళ్తున్న క్రమంలో కంచరపాలెం, రామ్మూర్తి పంతులు బ్రిడ్జి వద్ద ఈ రైలు అద్దాలను కొంతమంది ఆకతాయిలు పగులగొట్టారు. గురువారం రైల్వే అధికారులు తనిఖీలు చేసి పగిలిన రెండు అద్దాలను బాగు చేయించారు. దీంతో విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలకు పూర్తిస్థాయిలో ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సిద్ధంగా ఉందని రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతి తాజాగా వెల్లడించారు.


కంపార్టుమెంట్లను పరిశీలిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్పీడ్ రైలు పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన రైలు అని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఆధునిక ఫీచర్లతో ఈ రైలు నిర్మాణం చేపట్టారు. ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్ సీట్లు 52, కోచ్ కంపార్టుమెంట్‌లో 78 సీట్లును విమానంలో ఉండే మాదిరిగా ఏర్పాటు చేశారు. మొత్తం రైలు స్లెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేయబడింది. స్లైడింగ్ డోర్‌లు, ప్రతి ఒక్కరికీ రీడింగ్ లైట్లను అమర్చే విధానం, మొబైల్ ఛార్జింగ్ పాయింట్స్, అటెండెంట్‌ను పిలిచేందుకు ప్రత్యేక బటన్ సిస్టమ్, బయో టాయ్‌లెట్స్, ఆటోమేటిక్‌గా లోపలకు ప్రవేశం, బయటకు వచ్చే డోర్లు వంటి ఏర్పాట్లు ఉన్నాయి. సిసి టివిలను ఎక్కడికక్కడే కంపార్ట్‌మెంట్లలో అమర్చారు.

పోలీసుల అదుపులో దాడి నిందితులు

ఎంవిపి.కాలనీ : వందే భారత్ రైలుపై దాడి చేసి రెండు కోచ్‌ల్లోని అద్దాలను ధ్వంసం చేసిన నిందితులను రైల్వే పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో కంచరపాలెంనకు చెందిన గోశాల శంకర్, అతని మిత్రులు చందు, రాజులు మద్యం సేవించి రైల్వే గేట్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద ఈ వందేభారత్ రైలుపై రాళ్లతో దాడి చేశారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యారు. సిసి ఫుటేజీ ఆధారంగా పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారు. వీరిలో గోశాల శంకర్‌పై నాలుగు ఆస్తి నేరాల కేసులున్నాయి. మదీనాబాగ్‌కు చెందిన టేకేటి చందు జిఆర్‌పి హత్య కేసులో ప్రమేయం కలిగి ఉన్నాడు. వారంతా నేరం అంగీకరించారు.

మోడీ పాలనలో దేశ ఆర్థికాభివృద్ధి క్షీణత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తూ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తోందని, దేశాభివృద్ధి మరింత కుంటుపడుతోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. సిపిఐ విశాఖ జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోడీ పాలనలో దేశం మునుపెన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లో వెనుకబడిందని, సంపన్న వర్గాల ఆస్తుల రోజురోజుకూ పెరుగుతున్నాయని, పేదవారు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిజెపి ఘోర పరాభావం మూటకట్టుకుందని తెలిపారు. గుజరాత్ మినహా ఎక్కడా అనుకుంత మేర ఫలితాలు రాలేదన్నారు. వైసిపి ప్రభుత్వ తొత్తుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఒకప్పుడు రాయలసీమ ప్రాంతానికే పరిమితమైన ఈ ధోరణి నేడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిందని, ప్రతిపక్షాలను అణగదొక్కడమే ధ్యేయంగా వైసిపి పాలన సాగిస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభావం రాష్ట్రంలో పెద్దగా లేదన్నారు. ఆ పార్టీతో సంబంధం లేదని చెప్పుకుంటూనే వైసిపి సంబంధాలు కొనసాగిస్తోందని అన్నారు. అనంతరం పార్టీ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి కార్యకర్తలు

కొమరవరంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలో కొమరవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వైసీపీ అనైతిక విధానాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, నాయకులు కుంజం బాపన్న దొర, భద్రం దొర, బంధం బాపన దొర, బంధం రమేష్ బాబు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - అడ్డతీగల : బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... గంగవరం మండలం కరకపాడు గ్రామానికి చెందిన కుంజం జగ్గన్నదొర (30), తన బావ సారపు బాలు దొరతో కలిసి మోహనాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. బుధవారం రాత్రి వెళ్లి తిరుగుప్రమాణంలో స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఇద్దరిని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జగ్గన్న దొర మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బాలు దొరను మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

700 రోజులకు 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారానికి 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్దకు భారీగా యువ కార్మికులు తరలివచ్చి నిరసన తెలిపారు. సుదీర్ఘకాలంగా పోరాటం సాగుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. ఈ నెల 30న ఉక్కు నగరంలోని తృష్ణ గ్రౌండ్స్‌లో తలపెట్టిన ఉక్కు ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల మద్దతు తమకు అవసరమన్నారు.

ఒక్క పరిశ్రమనూ స్థాపించని మోడీ ప్రభుత్వం

కలెక్టరేట్ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమను ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదని సిఐటియు గోపాలపట్నం జోన్ కార్యదర్శి పి.సత్యనారాయణ అన్నారు. భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయలేని మోడీ ప్రభుత్వానికి ప్రభుత్వ రంగంలోని భారీ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అమ్మివేసే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారానికి 652వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నందునే విశాఖ నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, లక్షలాది మంది ఉపాధి పొందారని తెలిపారు. అటువంటి గొప్ప కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మడాన్ని అంగీకరించేది లేదన్నారు. దీన్ని తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కలెక్టరేట్ : పిఠానిదిబ్బలో భవన నిర్మాణ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యాన గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలికలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సింగరావు అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మణి, వరలక్ష్మి, సత్యవతి, లక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామారావు, సిఐటియు నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.